క్లుప్తంగా

నేడు బలిజేపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లిలో నేడు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి సోమవారం తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పక్కాల సూరిబాబు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులు,, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు ఇరుకుపాలెంలో ..

ముప్పాళ్ళ: మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పేర్లు నమోదుకు ఆహ్వానం

నకరికల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పేర్లు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైందని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. 15ఏళ్లు నిండి ఆసక్తి కలిగిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కబడ్డీ, ఖో–ఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహిస్తారని అన్నారు. సచివాలయంలో హౌస్‌హోల్డ్ అయిఉంటేనే దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుందని అన్నారు. క్రీడా పోటీలు చూసేందుకు ప్రేక్షకులుగా కూడా నమోదు చేసుకోవచ్చని అన్నారు. పంచాయతీ కార్యదర్శులను, డిజిటల్ అసిస్టెంట్లను కలసి పేర్లు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

దిలీప్‌కుమార్ మృతి బాధాకరం

సత్తెనపల్లి: ఎలక్ట్రీషియన్ దిలీప్‌కుమార్ మృతి బాధాకరమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సందెపోగు గాంధీ సోదరుడు ఎలక్ట్రీషియన్ దిలీప్‌కుమార్(55) గుండె పోటుతో సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మంత్రి అంబటి రాంబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గేదెల కొనుగోలుకు సబ్సిడీపై రుణాలు



అచ్చంపేట: జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని సేవాకార్యక్రమంగా పరిగణించి, గేదెలు కొనుగోలు చేసుకునేందుకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) పథకం ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీయువకులు పరిశ్రమ స్థాపనకు, సేవాసంస్థలు స్థాపించి మరికొంతమందికి ఉపాధి కల్పించేందుకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఈ పథకానికి అర్హులన్నారు. ఉత్పాదక రంగంలోనైతే రూ.50 లక్షలు, సేవా రంగంలో అయితే రూ.20 లక్షల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పథకాన్ని వినియోగించుకుని జనగన్న పాలవెల్లువ ద్వారా సబ్సిడీపై గేదెలు కొనుగోలు చేసుకుని డైరీ యూనిట్ స్థాపించవచ్చని చెప్పారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ భరత్ రెడ్డిని సంప్రదించవలసినదిగా తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి, ఐకేపీ ఏపీఎం షేక్ సలీమ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలి

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేస్తున్నాయని, పిల్లలను బాలకార్మికులుగా మార్చకుండా అందరూ బడిలో ఉండాలని పారాలీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి అన్నారు. మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో ఏపీ హైకోర్టు ఆదేశాల మేర సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు బాలకార్మిక వ్యవస్థ అరికట్టేందుకు గాను సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సత్తెనపల్లి కోర్టు పరిధిలో బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు గాను కొన్ని రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. డ్రైవ్‌లో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న బాలకార్మికులను గుర్తించి వారిని చైతన్యం చేసి బడికి పంపించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ గజ్జల రోజా, మహిళా పోలీస్ షేక్ పర్వీన్, వలంటీర్లు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

శంభో శంకరా..

- కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- మారుమోగిన శివనామస్మరణ



పట్టణంలోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో నిర్వహించిన లక్ష దీపోత్సవం

సత్తెనపల్లి: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం శైవక్షేత్రాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయం, గుంటూరురోడ్‌లోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠం, కొత్తపేట భావనాఋషీ దేవాలయం, పెద్దమక్కెనలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు శైవక్షేత్రాల్లో కార్తీక దీపాలు వెలిగించి స్వామి దర్శనానికి బారులు తీరారు. పెద్దమక్కెనలో రుద్రాభిషేకం నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. అంతటా హర హర మహదేవ శంభో శంకరా అంటూ శివనామస్మరణ మారుమోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో లక్షదీపోత్సవం

కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష దీపాలతో మహా శివలింగం ఏర్పాటు చేశారు. బాలాత్రిపుర సుందరి సమేత మల్లిఖార్జున స్వామి, గోవిందామాంబా సమేత వీరబ్రహ్మేంద్ర స్వామికి పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. 116 జ్వాలాతోరణం వత్తులను వెలిగించి ఆశ్రమ వంశ పారంపర్యం ధర్మకర్త లలితాంబా మాతాజీ ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాల్లో కార్తిక సోమవారం పూజలు

ముప్పాళ్ళ: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాలలో భక్తులు కార్తికదీపాలు వెలిగించారు. మండల కేంద్రం ముప్పాళ్ళలోని పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లంకెలకూరపాడు గ్రామంలోని గంగాపార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమంలోను, చాగంటివారిపాలెం గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.



స్థానిక హరిహరక్షేత్రంలోని శివాలయంలో ధ్వజ స్థంభం వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామికి భస్మాభిషేకం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారికి సోమవారం భస్మాభిషేకం చేశారు. కార్తికమాసం పురస్కరించుకొని పిడుగురాళ్లకు చెందిన కొత్త మాసు నాగేశ్వరరావు 65 కేజీల భస్మాన్ని స్వామి వారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భస్మాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని భస్మంతో అలంకరించారు.



పెద్దమక్కెనలో రుద్రాభిషేకంలో భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

అచ్చంపేట: మండలంలోని పలు శివాలయాలలో కార్తిక సోమవార పూజలు ఘనంగా జరిగాయి. శివునికి అత్యంత ప్రీతికరమైన రోజు, అది కూడా కార్తిక మాసంలో వచ్చే సోమవారానికి విశిష్టత ఉండటంలో భక్తులు శివాలయాలలో కార్తిక దీపాలు వెలిగించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, మన్యసూక్త పారాయణ నిర్వహించారు. శివనామస్మరణతో శివాలయాలు మారుమోగాయి.



ముప్పాళ్ళ శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చంద్రమౌళీశ్వరస్వామిని దర్శించుకొన్న తెలంగాణ దేవరకొండ జూనియర్ సివిల్ ప్రిన్సిపల్ జడ్జి



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారిని తెలంగాణ రాష్ట్రంలోని దేవరకొండ జూనియర్ సివిల్ ప్రిన్సిపల్ జడ్జి కె.వి.ఎస్ హరీష్ బాబు సోమవారం కుటుంబసభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ధర్మకర్త పమిడిమర్రు శ్రీనివాసరావు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.



పట్టణంలోని శివాలయంలో ధ్వజస్థంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పట్టణంలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పట్టణంలోని కొత్తపేటలో కాంతులీనుతున్న కార్తికదీపాలు



భస్మాభిషేకంలో నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి

అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే జగనే రావాలి

గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



అభివృద్ధి, సంక్షేమ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నిమ్మ కాయల రాజనారాయణ

సత్తెనపల్లి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ రావాలని గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని పేదలకు రానున్న రోజుల్లో మరింత మేలు జరగాలంటే జగన్ రావాలన్నారు. గత నాలుగున్నర ఏళ్ల జగన్ పాలన స్వర్ణ యుగాన్ని తలపిస్తుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతాయన్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ముందుగా భట్లూరు గ్రామానికి జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన రూ.18,46,67,123 డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం అక్కడే బస చేసేందుకు ఉపక్రమించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తంరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ తేలుకుట్ల సైదారావు, మాజీ సర్పంచ్ ఉగ్రంకి మల్లిఖార్జున రావు, మాజీ ఎంపీటీసీ భట్లూరి కోటేశ్వరరావు, నాయకులు దాసరి విజయ్, ఉగ్రంకి పరమేశ్వరరావు, గుజ్జర్లపూడి బాజీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కట్టేందుకే చేరికలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కట్టేందుకు టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు సైతం వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి స్వయంగా వారంతటవారు వచ్చి మేము వైఎస్సార్ సీపీ వెంటే ఉంటామంటూ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. తాజాగా సోమవారం చామర్రు గ్రామం నుంచి టీడీపీకి చెందిన 10 బీసీ యాదవ కుటుంబాలవారు గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి పార్టీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడారు. ఎవరి సిఫార్సులు లేకుండా పార్టీలు, మతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు. అందువల్లనే వారంతా జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం స్పష్టంగా కనబడుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారిలో కోనంగి వీరయ్య, గౌతుకట్ల అన్నమయ్య, గౌతకట్ల వెంకటేశ్వరరావు, గౌతుకట్ల శ్రీనివాసరావు, తెల్లమేకల అంకమ్మరావు, గౌతుకట్ల నాగేశ్వరరావు, గౌతుకట్ల ఏడుకొండలు, గౌతుకట్ల హనుమంతరావు, గౌతకట్ల తిరుపతిరావు, గౌతకట్ల లక్ష్మలతో పాటు వారి కుటుంబ సభ్యులంతా వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ తెల్లమేకల నాగరాజు, పరంధామయ్య, ఉప సర్పంచ్ షేక్ జాని తదితరులున్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

రీ సర్వేపై అపోహలను విడనాడాలి

- ఆడుదాం ఆంధ్రాలో అందరూ భాగస్వాములు కావాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష ద్వారా లభించనుందని, రీ సర్వేతో సర్వహక్కులు లభిస్తాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. ఎక్స్‌అఫిషియోగా హాజరైన మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు వందేళ్ల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ రీ సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటి వరకు తొలి, రెండో విడతలు పూర్తయ్యాయని తాజాగా మూడో విడత రీ సర్వే జరుగుతుందన్నారు. గతంలో ఒకే సర్వే నెంబర్ లో రకరకాల పేరుతో పలువురికి భూములు ఉండేవని, ఇకపై సర్వే నెంబర్లు పాత్ర పాత చరిత్రగా మిగిలి పోనుందన్నారు. ఇకపై ఎల్‌పీ(ల్యాండ్ పార్సిల్) నంబర్లు మాత్రమే ఉంటాయన్నారు. రీసర్వేపై అపోహలు విడనాడాలని ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్లు, అధికారులు రీ సర్వేపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రీ సర్వేతో రైతులు, భూ యజమానులు నిశ్చింతగా ఉండొచ్చని, చాలా పకడ్బందీ ప్రక్రియ ఇదన్నారు. దీని వల్ల భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు చోటు చేసుకోవన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో భాగస్వాములు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి అంబటి పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు టోర్నీ జరుగుతుందని, అన్ని సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనికి నగదు బహుమతులు సైతం అందించటం జరుగుతుందన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ముందుగా అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ

ప్రత్తిపాటి ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటు

బెల్లంకొండ: మండలంలోని వన్నాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ క్రియాశీల కార్యకర్త ప్రత్తిపాటి ప్రసాద్ (40) మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి అన్నారు. ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన ప్రసాద్ మృతదేహాన్ని సోమవారం మండల పార్టీ నాయకులతో కలిసి ఆమె సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారని, పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ప్రారంభమైన వరికోతలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో ఖరీఫ్ వరికోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. వరిసాగులో అధిక దిగుబడులు, నాణ్యమైన పంటకు నర్సింగపాడు ప్రతీతి. బోర్లు, బావులు ఉండడం, అదనంగా సాగర్‌కెనాల్ ద్వారా నీటిలభ్యత గల గ్రామం కావడంతో వరి అధికంగా సాగు చేస్తారు. మండలంలో ముందస్తుగా నాట్లు వేస్తారు కాబట్టి కోతలు కూడా ముందుగా వస్తాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏపీ 567, జేజీఎల్ 384, అంకూర్‌సోనమ్, బీపీటీ 5204 రకాలను రైతులు సాగు చేశారు. ఇటీవల పంటకోత ప్రయోగాలు చేసిన అధికారులు ఏపీ 567 రకం ఎకరాకు 32–33 బస్తాలు, అలాగే మిగిలిన రకాలు 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. ధర కూడా 75కేజీల బస్తాకు రూ.2 వేల వరకు పలుకుతుంది. దీంతో రైతులు ఒకింత ఆనందంలో ఉన్నారు.

గర్నెపూడి మాజీ సర్పంచ్ చినప్రకాశరావు మృతి

సత్తెనపల్లి: మండలంలోని గర్నెపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాశిమాల చిన్న ప్రకాశరావు (74) గుండెపోటుతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య చిలకమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు సోమవారం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు మాజీ ఎంపీటీసీ కాశిమాల ఓబయ్య, ఉప సర్పంచ్ బిల్లా రవి, తదితరులున్నారు.

ప్రజా సంక్షేమమే ఆనందం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



బొల్లవరంలో గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

బొల్లవరం(ముప్పాళ్ళ): ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ఎంత కష్టమైనా భరిస్తూ అందరికీ సంక్షేమ వెలుగులు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, అక్కడికక్కడే పరిష్కరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, పారదర్శకంగా నేరుగా వారి ఖాతాల్లోనే నిధులు జమ చేస్తున్న ప్రభుత్వమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో అందరూ అండగా ఉండాలని కోరారు. మొత్తం 260 గృహాలను సందర్శించారు.

రూ.10.75 కోట్ల లబ్ధి....

300 నివాసాలున్న గ్రామంలో గత నాలుగున్నరేళ్లలో రూ.10.75 కోట్ల లబ్ధి జరిగిందన్నారు. వీటిలో ప్రత్యక్ష నగదు బదిలీలో రూ.7,14,07,618, పరోక్ష నగదు బదిలీలో రూ.1,43,38,939 సాయం అందిందన్నారు. వీటితో పాటుగా రూ.2.18 కోట్ల మేర పలు రకాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దిగం పూజితారెడ్డి, ఎంపీటీసీ కళ్ళం వీరభాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ భవానీశంకర్, ఎంపీడీవో కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, నాయకులు గోపాలరావు, వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, రంగమోహన్ రెడ్డి, సింగయ్య, చింతపల్లి రవి, చల్లా శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బొల్లవరంలో గడప గడపకు మన ప్రభుత్వంలో బుక్‌లెట్‌ను అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రయోగాత్మకంగా పత్తి దిగుబడి సేకరణ



అచ్చంపేట: పత్తిపంటలో వచ్చే దిగుబడిని మండలంలోని కస్తల గ్రామానికి చెందిన భీమిరెడ్డి కృష్ణారెడ్డి భూమిలో వ్యవసాయశాఖ ఏవో పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ప్రయోగాత్మకంగా సేకరించారు. వ్యవసాయశాఖ సూచనల మేరకు వేసిన 10 చదరపు మీటర్ల విస్తీర్ణం గల భూమిలో 16.170 కిలోల నాణ్యమైన పత్తి దిగుబడి వచ్చినట్లు నిరూపించారు. వ్యవసాయశాఖ ద్వారా ఆర్బీకేలలో వివరించే సూచనలు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధ్యపడతాయని ఏవో తెలిపారు. ఇదే విధంగా మిరప, వరి పంటలలో కూడా నమూనాలు తీయడం జరుగుతుందన్నారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. యాజమాన్య పద్ధతిలో వ్యవసాయం చేస్తే నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నాగశ్రీ, విస్తరణాధికారులు నాయక్, రైతులు పాల్గొన్నారు.